క్లుప్తంగా

ఘనంగా హర్ ఘర్ తిరంగా



పట్టణంలో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహిస్తున్న స్థానికులు

యలమంచిలి రూరల్: పట్టణంలో హర్ ఘర్ తిరంగా యాత్ర మంగళవారం నిర్వహించారు. ఈ యాత్రను మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి ప్రారంభించి మాట్లాడారు. దేశ పౌరులందరిలో దేశభక్తి, జాతీయ సమైక్యత పెంపొందించడానికి ఈ యాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వర్రావు, పప్పు ఈశ్వర్రావు, సుందరపు బాబ్జీ, పిట్టా దాసు, బొడ్డేడ నాగేశ్వర్రావు, బొద్దపు శివ, అగ్రహారపు కుమారస్వామి, మళ్ల కొండబాబు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం

మునగపాక: వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకుడు సీహెచ్ సుబ్రహ్మణ్యం కోరారు. మండలంలోని నాగులాపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన ఆయన రైతులతో మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతీ రైతుకు అన్నదాత సుఖీభవ సాయం అందుతుందన్నారు. వరిలో ఆకుమడులు వేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఏవో జ్యోత్స్నకుమారి, ఎంపీఈవో బాషిత, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడికి ఘన నివాళి



గ్రంథాలయాధికారి కోటేశ్వర్రావుకు సన్మానం

అచ్యుతాపురం రూరల్: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ 133వ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా హాజరయ్యారు. గ్రంథపాలకుడు డి.కోటేశ్వరరావును గ్రంథాలయ ఉద్యోగులందరూ ఘనంగా సన్మానించారు. సభాధ్యక్షుడిగా విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు వి. ఆనందరావు వ్యవహరించారు. విశిష్ట అతిథిగా అచ్యుత విద్యా సంస్థల కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు, ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రంథాలయ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

కాపులుప్పాడకు చెత్త తరలింపు



చెత్తను పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: విశాఖ జిల్లా కాపులుప్పాడలో జిందాల్ పరిశ్రమకు మంగళవారం మునగపాక నుంచి చెత్త తరలించారు. పలు లారీల ద్వారా చెత్త తరలింపు పనులను సర్పంచ్ దిమ్మల అప్పారావు మంగళవారం పర్యవేక్షించారు. ఇక్కడ సేకరించిన చెత్తను లారీల ద్వారా జిందాల్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పోక్సో చట్టం, బాల్య వివాహాలపై అవగాహన

యలమంచిలి రూరల్: పిల్లలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, శక్తియాప్ వల్ల ప్రయోజనాలపై పలు పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం జిల్లా పోలీసు శాఖ ప్రత్యేకంగా తయారు చేసిన మొబైల్ వాహనంతో అవగాహన కల్పించారు. కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, రేగుపాలెం, పులపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో వీడియో ద్వారా ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు యలమంచిలి రూరల్ ఎస్సై ఎం ఉపేంద్ర తెలిపారు.

'నేవల్ బేస్‌కు పైడమ్మ చెరువు కేటాయించొద్దు'

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం వాడనర్సాపురంలో పైడమ్మ చెరువును నేవల్ బేస్‌కు అప్పగించవద్దని గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను కోరారు. మంగళవారం వారు అచ్యుతాపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్లి పైడమ్మ చెరువు వివాదం గురించి వివరించారు. తరతరాల నుంచి రైతులకు, చేపల వేటకు ఉపయోగపడే చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయాలని ప్రయత్నిస్తున్న నేవల్ బేస్ అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలని కోరారు.

కడసారి వీడ్కోలుకూ కష్టాలే..

- కోటవురట్లలో కానరాని శ్మశాన వాటిక
- దహన సంస్కారాలకు ఇబ్బందులు
- వర్షాకాలంలో ఈ పరిస్థితి మరీ దారుణం
- నదీ ఒడ్డున కర్మకాండలు



నది మధ్యలో దహన సంస్కారాలు నిర్వహిస్తున్న హిందువులు(ఫైల్)



కోటవురట్లలో వరాహనది ఒడ్డున హిందూ శ్మశాన వాటిక

కోటవురట్ల: ఆత్మీయులను కోల్పోతే ఆ బాధ వర్ణనాతీతం.. దహన సంస్కారాలు పూర్తయ్యేంత వరకు వారి దుఃఖానికి అంతే ఉండదు.. మరి దహనక్రియలకు స్థలాలను వెతుక్కోవలసిన పరిస్థితులు వస్తే అది మరింత వేదనను కలిగించకమానదు.. కోటవురట్లలో అవే పరిస్థితులు ఉన్నాయి. ఆత్మీయులను కోల్పోయి అంతులేని దుఃఖంలో ఉంటే దహనక్రియలలో ఇక్కట్లు మరింత ఆవేదనకు గురిచేస్తున్నాయి. కన్నీటి వీడ్కోలు పలికే క్రమంలో శ్మశాన వాటికలో సమస్యలు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి. హిందూ శ్మశాన వాటిక లేకపోవడంతో దహనక్రియలకు ఇక్కట్లు తప్పడంలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వరాహనది ఒడ్డున పిచ్చిమొక్కల మధ్యలోనే అంతిమ సంస్కారాలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రత్యేకంగా శ్మశాన వాటిక లేకపోవడంతో వర్షాకాలంలో మరిన్ని కష్టాలు వెంటాడుతున్నాయి.

కోటవురట్లలో 7,324 మంది జనాభా ఉన్నారు. ముస్లిం, క్రైస్తవులకు సంబంధించి వేర్వేరుగా శ్మశాన వాటికలు ఉండగా హిందువులకు ప్రత్యేకంగా ఏమీ లేకపోవడంతో వరాహనది ఒడ్డున, నది మధ్యలోనూ నిర్వహిస్తుంటారు. వేసవి, శీతా కాలాల్లో నది ఎండిపోయి ఉండడంతో నది మధ్యలో దహన సంస్కారాలు చేస్తారు. నదిలో వరదనీటి ప్రవాహం ఉంటే దహనక్రియలకు పడరాని పాట్లు పడతారు. నది ఒడ్డున తుప్పలు, పల్లేరుకాయల మధ్యలో ఏదో అయ్యింది అన్నట్టుగా గొడుగులు పట్టుకుని దహన సంస్కారాలు చేస్తారు. నిలువ నీడ కూడా లేకపోవడంతో ఎండకూ వానకూ అవస్థలు తప్పడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదం అంచున దహన సంస్కారాలు..

వర్షాకాలంలో నదిలో ప్రవాహం ఉన్నప్పుడు ప్రమాదం అంచున దహన సంస్కారాలు చేస్తున్నారు. దహనక్రియల అనంతరం స్నానాలు చేయాలంటే వేసవిలో నదిలోని ప్రత్యేక చెలమలలో ఆచరిస్తారు. నది ప్రవహించేటపుడు ఒడ్డున స్నానాలు చేస్తారు. దాంతో బిక్కుబిక్కుమంటూ కార్యక్రమాలు నిర్వహించాల్సిన పరిస్థితులు ఉన్నాయని వాపోతున్నారు. వాస్తవానికి ప్రత్యేక శ్మశాన వాటిక ఉండడంతోపాటు అందులో కనీస సదుపాయాలుగా షెడ్, చేతిబోరు, లైట్, విద్యుత్ దహన పేటిక ఉండాలి. శ్మశాన వాటిక లేకపోవడతో కార్యక్రమాలన్నీ నదిలో లేదా ఒడ్డున చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా ఇటు ప్రజా ప్రతినిధులు, అటు అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. ఎవరూ పట్టించుకోకపోవడంతో తప్పని పరిస్థితుల్లో హిందువులు నది ఒడ్డునే కార్యక్రమాలు చేస్తూ కాలాన్ని నెట్టుకొస్తున్నారు. ఎప్పటికపుడు అవస్థలు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించడంతో పాటు కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలి..



కోటవురట్లలో హిందూ శ్మశాన వాటిక లేకపోవడం దారుణం. ఎన్నో ఏళ్లుగా సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం ఆవేదన కలిగిస్తోంది. ప్రత్యేకంగా శ్మశాన వాటిక లేకపోవడంతో వరాహనది ఒడ్డున దహన సంస్కారాలు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి శ్మశాన వాటిక ఏర్పాటుకు కృషి చేయాలి. – కశిరెడ్డి నాగు, కోటవురట్ల

వర్షాకాలంలో అవస్థలే..



హిందూ శ్మశాన వాటిక లేకపోవడంతో వర్షాకాలంలో ఇబ్బంది తప్పడం లేదు. గొడుగులు పట్టుకుని నది ఒడ్డున తుప్పల్లో దహన క్రియలు చేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి స్థలాన్ని కేటాయించడంతో పాటు కనీస సదుపాయాలు కల్పించాలి.

– పినిపాత్రుని మల్లేష్, కోటవురట్ల

ధర్మశ్రీ పరామర్శ



వైఎస్సార్‌సీపీ నేత నాయుడును పరామర్శిస్తున్న సమన్వయ కర్త ధర్మశ్రీ, ప్రసాద్

మునగపాక: మండలంలోని పాత నాగవరంలో వైఎస్సార్‌సీపీ నేత పాలిపిని నాయుడును పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మంగళవారం పరామర్శించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నాయుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వేగంగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు, వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ, తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ తదితరులు ఉన్నారు.

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం



విరాళం అందజేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామ సరిహద్దులో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. దీనిలో భాగంగా మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, సంతోష్ రామప్పారావు మంగళవారం రూ.10,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు దారుణం

- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ధర్మశ్రీ



నాగవరం రచ్చబండలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ



పాత నాగవరంలో మహానేత రాజన్నకు నివాళులర్పిస్తున్న ధర్మశ్రీ, ప్రసాద్ తదితరులు

మునగపాక: కూటమి పాలనలో విద్యుత్ చార్జీలు పెరిగిపోయాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ విమర్శించారు. బూటకపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మండలంలోని గొల్లలపాలెం, మల్లవరం, నాగవరం గ్రామాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేవని గుర్తు చేశారు. గ్రావెల్ దందాకు తెరలేపారన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ రాజన్న రాజ్యం జగనన్నతోనే సాధ్యమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా కన్వీనర్ పిల్లి అప్పారావు, సర్పంచ్‌లు సుందరపు తాతాజీ, భీశెట్టి గంగప్పలనాయుడు, ఇందల హేమలత, కర్రి పెదబ్బాయి, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు శీరా రమణమ్మ, పార్టీ నేతలు బొద్దపు శ్రీరామమూర్తి, మద్దాల వీరునాయుడు, ఇల్లా నాగేశ్వరరావు, మళ్ల కాశీ సురేష్, నరాలశెట్టి సూర్యనారాయణ, పిన్నమరాజు రవీంద్రరాజు, కాండ్రేగుల జగన్, దొడ్డి బుజ్జి, బొడ్డేడ చెల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

నులిపురుగులను నివారిద్దాం..

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



కొడవటిపూడి జెడ్పీ హైస్కూల్‌లో పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రను మింగిస్తున్న నాయకులు



మునగపాక హైస్కూల్‌లో నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న డాక్టర్ విమలగిరి



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సిబ్బంది



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యులు



ఏపీఆర్ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

కోటవురట్ల: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కొడవటిపూడి జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం ఆర్.ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో మాత్రలను మింగించారు. సర్పంచ్ కె. అప్పారావు, ఎంపీటీసీ యలమంచిలి ప్రకాష్, ఎస్ఎంసీ చైర్మన్ యలమంచిలి శ్రీను, వైద్య సిబ్బంది మణికుమారి, సత్యవతి పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతో మాత్రలు మింగించారు. మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, పెద్దలు దాడి ముసిలినాయుడు, సూరిశెట్టి అప్పలనాయుడు, దాడి శివ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో 14,581 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని పీహెచ్‌సీ వీఎస్ సౌందర్య తెలిపారు. మిగిలిన పిల్లలకు ఈ నెల 20వ తేదీన మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఎంపీహెచ్‌వో నెహ్రూ, హెచ్ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్: అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. వైద్యాధికారి కె.శ్రావ్య, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో దేవరాయల్, ఏపీఆర్ పాఠశాల ప్రిన్సిపాల్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి: ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవో కుంచం నరేష్‌ల పర్యవేక్షణలో పీహెచ్‌సీ సిబ్బంది ఆల్బెండజోల్ విద్యార్థులకు మింగించారు. బోదిగల్లం, గొడిచర్ల పాఠశాలల్లో మాత్రలు మింగించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

డీపీవో సందీప్



ఒడ్డిమెట్టలో శానిటేషన్ పరిశీలిస్తున్న డీపీవో

నక్కపల్లి: నిరంతరంగా పారిశుధ్య నిర్వహణ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ ఆదేశించారు. మండలంలోని దేవవరం, ఒడ్డిమెట్ట గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. సచివాలయంలో పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో రోజూ శానిటేషన్ పనులు నిర్వహించాలని, వాటిని ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షించాలన్నారు. క్లోరినేషన్ చేయించాలన్నారు. బావులు, రక్షిత నీటి పథకాలు, వీధుల్లోను బ్లీచింగ్ జల్లించాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లు, వీధి లైట్ల నిర్వహణ, అనధికార లేఅవుట్లపై పంచాయతీ అధికారుల పర్యవేక్షణ చేయాలన్నారు. ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆపరేషన్ థియేటర్‌లో భోజనాలపై డీఎంహెచ్‌వో ఆగ్రహం

- రేగుపాలెం పీహెచ్‌సీ వైద్యురాలు, ముగ్గురు సిబ్బందికి మెమో

సాక్షి ఎఫెక్ట్..

యలమంచిలి రూరల్: మండలంలోని రేగుపాలెం పీహెచ్‌సీ ఆపరేషన్ థియేటర్(ఓటీ)లో మధ్యాహ్న భోజనాలు చేస్తున్న విషయంపై డీఎంహెచ్‌వో ఎం హైమావతి మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో పరిశుభ్రంగా ఉండాల్సిన ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్‌లో రోజూ సిబ్బంది ఏసీ వేసుకుని భోజనాలు చేస్తున్న వైనంపై మంగళవారం సాక్షి దినపత్రికలో 'ఆపరేషన్ థియేటరా? డైనింగ్ హాలా?' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డీఎంహెచ్‌వో ఉదయమే ఆస్పత్రి వైద్యాధికారి డీఎంఎస్ సుగుణకు ఫోన్ చేసి మరీ ఇంత నిర్లక్ష్యమా? అంటూ పద్ధతి మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. తక్షణమే ఓటీకి తాళం వేసి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వైద్యురాలు సుగుణతోపాటు ఓటీలో భోజనాలు చేస్తున్న స్టాఫ్ నర్సు ఏ అప్పలకొండమ్మ, ఫార్మసీ అధికారి జె. నూకరత్నం, ఓటీ టెక్నీషియన్ పి. వెంకటలక్ష్మిలకు మెమో జారీ చేసినట్టు డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై రెండ్రోజుల్లోగా సమగ్రమైన వివరణ ఇవ్వాలిందిగా ఆదేశించారు.

రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా



రాత్రి సమయంలో నరేంద్రపురంలో కొండను చదును చేసిన అక్రమార్కులు

అచ్యుతాపురం రూరల్: మండలంలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. రోజుకో కొండ ఎంచుకుని జేసీబీలతో అక్రమంగా గ్రావెల్‌ను తవ్వేసి పదుల సంఖ్యలో లారీల్లో రవాణా చేస్తోంది. సోమవారం అర్ధరాత్రి నరేంద్రపురం శివారులో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టింది. మండలంలో నడింపల్లి, మడుతూరు, మళ్లవరం, ఉప్పవరం, ఎర్రవరం, నరేంద్రపురం, ఎం.జగన్నాథపురం, కొండకర్ల, చీమలాపల్లి, వెదురువాడ ఇలా ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా కొండలను పిండి చేస్తూ అక్రమార్కులు రాత్రికి రాత్రి కుబేరులవుతున్నారు. కూటమి నాయకులు ఆగడాలకు అడ్డుకట్ట వేయలేని కొందరు దిగువ స్థాయి అధికారులు మామూళ్లు మత్తులో జోగుతున్నారని ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు త్వరితగతిన స్పందించి అక్రమార్కుల ఆగడాలను అడ్డుకట్ట వేసి ప్రభుత్వ ఆస్తులను, పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

ఎస్.రాయవరం: పాఠశాలల్లో లక్ష్యాలు అధిగమించే విద్యా బోధన జరగాలని డీఈవో అప్పారావునాయుడు తెలిపారు. మండలంలోని ధర్మవరం అగ్రహారం ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఎఫ్ఏ– 1 పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయుల బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎంకు పలు సూచనలు చేశారు.

డిఫెన్స్ మద్యం స్వాధీనం



కుమారపురంలో వివిధ రకాల డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

అచ్యుతాపురం రూరల్: అచ్యుతాపురం హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో అనధికారంగా డిఫెన్స్ మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు అనకాపల్లి ఏఈఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కె.సురేష్ తెలిపారు. అచ్యుతాపురం కుమారపురంలో ప్రసాద్ వద్ద వివిధ బ్రాండ్‌లు (67) 750 ఎంఎల్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీటి విలువ రూ.60 ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.సి ఎన్‌ఫోర్స్‌మెంట్ అనకాపల్లి జె.శ్రీనివాస్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ యలమంచిలి పి.తేజోవెంకట కుమార్, ఎక్సైజ్ ఎస్సై పి.వి.గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


హాకీ క్రీడాకారులకు జెర్సీల వితరణ



జెర్సీలతో హాకీ క్రీడాకారులు

యలమంచిలి రూరల్: పట్టణానికి చెందిన పూర్వ సీనియర్ హాకీ క్రీడాకారుడు గదుల సత్యనారాయణ తన భార్య నాగమణి జ్ఞాపకార్థంగా 18 మంది క్రీడాకారులకు మంగళవారం జెర్సీలను పంపిణీ చేశారు. స్థానిక క్రీడా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హాకీకి పుట్టినిల్లుగా యలమంచిలి పేరొందిందన్నారు. ఇక్కడ హాకీ అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి అందరూ సహకరించాలని అభిప్రాయపడ్డారు. యలమంచిలి అప్పారావు, కొఠారు దుర్గారావు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన తప్పనిసరి



విక్రమ్ సారాభాయ్ గురించి వివరిస్తున్న జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి

యలమంచిలి రూరల్: పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన అవసరమని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కొలగాని వర ప్రసాద్ సూచించారు. మంగళవారం రాత్రి కృష్ణాపురం చిల్డ్రన్స్ క్లబ్‌లో పిల్లలకు భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ జీవిత చరిత్రను వివరించారు. అనంతరం గ్రంథాలయ పితామహుడు రంగనాథ్ జయంతి నిర్వహించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

మునగపాక : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శచీదేవి పిలుపునిచ్చారు. ఒంపోలులో మంగళవారం మహిళా సంఘాలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించుకొని అభివృద్ధి సాధించాలన్నారు. మన డబ్బులు–మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా ఒంపోలు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. ఇక్కడి సంఘాల నిర్వహణతోపాటు ప్రతి నెలా తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవాలని సూచనలు చేశారు. వెలుగు ఏపీఎం బాలరాజు, సీసీలు రామకృష్ణ, వేణు, వీవోఏ శ్యామల పాల్గొన్నారు.